
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 39.0
కనిష్ఠం 25.8
***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 19 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.50 (122.5225)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.66)	78.39	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	96.17 (0.56)	నిల్	1621

చికెన్ ధరలు | లైవ్ :రూ.161 | డ్రెస్ :రూ.234 | స్కిన్‌లెస్ : రూ.266



ప్రధాన ద్వారం ఎదుట భక్తుల రద్దీ

గుండెల నిండా
నృసింహ స్మరణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న విప్ అయిలయ్య, ఈవో భాస్కర్‌రావు

'గిరి'ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

» తొలిరోజు 'గిరి' ప్రదక్షిణలో 10,000 మంది » ప్రదక్షిణను ప్రారంభించిన విప్ అయిలయ్య

గుండెల నిండా లక్ష్మీనృసింహుడి నామస్మరణతో 'గిరి' ప్రదక్షిణ ఆధ్యాత్మిక వాతావరణం నడుమ కొనసాగింది. స్వామివారి దేవస్థానంలో అనవాయితీగా వస్తున్న గిరిప్రదక్షిణలో మంగళవారం అంచనాలకు మించి భక్తులు పాల్గొని ఏకశిఖరవాసుడిపై భక్తిని చాటుకున్నారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. తొలిరోజు 'గిరి' ప్రదక్షిణలో 10వేల మంది భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో వైకుంఠ ప్రాంతమంతా జన సంద్రంగా మారింది. ఉదయం 5.30గంటలకు వైకుంఠ ద్వారం నుంచి మొదలైన ప్రదక్షిణ కొండ చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల మేర కొనసాగింది.

- భువనగిరి అర్బన్

7



22న డీసీఎంఎస్
చైర్మన్ ఎన్నిక

» షెడ్యూల్ విడుదల చేసిన జిల్లా సహకార అధికారి » ఏకగ్రీవం అయ్యే అవకాశాలు?

నల్లగొండ, జూన్ 18: నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం చైర్మన్ ఎన్నికకు జిల్లా సహకార అధికారి, డిప్యూటీ కోఆపరేటివ్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ మంగళవారం షెడ్యూల్ విడుదలచేశారు. చైర్మన్ ఎన్నికకు ఈ నెల 22వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. 2020 ఫిబ్రవరిలో డీసీఎంఎస్‌కు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 10మంది డైరెక్టర్లు ఉన్న డీసీఎంఎస్‌కు సూర్యాపేటకు చెందిన వట్టె జానయ్యను చైర్మన్‌గా, దుర్గంపూడి నారాయణరెడ్డిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నా రు. అయితే 2023లో చైర్మన్ జానయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాథమిక సంఘం జనరల్ బాడీ సమావేశాలను సక్రమంగా నిర్వహించడం లేదన్న కారణంతో ఆ పాలకవర్గాన్ని పూర్తిగా రద్దుచేశారు. దీంతో ఆయన డీసీఎంఎస్ చైర్మన్ పదవిని కోల్పోయా రు. వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న దుర్గంపూడి నారాయణరెడ్డిని చైర్మన్‌గా నియమించారు. సహకార చట్టం ప్రకారం ఆరునెలల్లో చైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో ఇటీవల జరిగిన పాలకవర్గ సమావేశంలో ఎన్నిక నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయింది. ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 11గంటల నుంచి 11.30 గంటల వరకు నామినేషన్ల పత్రాల పరిశీలన, 12గంటల నుంచి 2గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ఉంటుంది. ఎవరైనా పోటీలో ఉంటే మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. బ్యాలెట్ పద్ధతిన ఈ ఎన్నిక జరగనుంది. అయితే చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నాయి.



అన్ని రైతు వేదికల్లో
వీడియో కాన్ఫరెన్స్

ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాలకు కేటాయింపులు

త్వరలో క్లస్టర్‌ల వారీగా సెంటర్‌ల ఏర్పాటు నిర్ణయం

నల్లగొండ, జూన్ 18: ఇక నుంచి ప్రతీ మండల రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో మాత్రమే ఆయా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు ఉండగా, తాజాగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు జిల్లాల్లో ప్రతీ మండలంలోని ఆయా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రైతులకు అవగహన కల్పించడంకోసం త్వరలో వ్యవసాయ క్లస్టర్ల వారీగా ప్రతీ మూడు, నాలుగు గ్రామాలకు ఒక వీడియో కాన్ఫరెన్స్ కేంద్రం అందుబాటులోకి రానుంది. రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు ప్రతీ వారం రైతులకు వివిధ పంటల సాగులో మెళకువలు ఇవ్వడం, శిక్షణ, అవగాహన కల్పిస్తారు. ఇందుకు వ్యవసాయ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు బాధ్యతలు తీసుకుని వీడియో కాన్ఫరెన్స్ సెంటర్ల ద్వారా కార్యక్రమాలు చేపడుతారు. రైతు వేదికల్లో ఎల్‌సీడీ, వీడియో కెమెరాలు, సౌండ్ సిస్టం వంటి సౌకర్యాలు కల్పించి వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మారుస్తారు. గతంలో నియోజవర్గానికి ఒక సెంటర్‌ను ప్రారంభించినప్పుడు సత్ఫలితాలు వచ్చాయి. దీంతో మండలానికో వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా వ్యవసాయంపై దృష్టిసారించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రాలతోపాటు తెలంగాణలో ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో వివిధ పంటల సాగుపై రూపొందించిన వీడియోలను కూడా ప్రదర్శించే అవకాశాలుంటాయి. దీనికి తోడు శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌ల ద్వారా ప్రతీ పంట సాగును,దానిలో యజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడుల సాధన కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సవివరంగా వివరిస్తారు. వీడియో కాన్ఫరెన్స్ సెంటర్లకు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడటంతోపాటు వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లోని రైతువేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు రైతులకు ప్రయోజనం చేకూర్చుతుండటంతో ప్రభుత్వం మండలాలకు వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌లను ఏర్పాటు చేయగా త్వరలో క్లస్టర్లకు కూడా ఈ విధానం అమల్లోకి రానుంది.

రైతులకు ఎంతగానో ప్రయోజనం



నల్లగొండ జిల్లాకు అదనంగా మరో 25 మండలాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఏర్పాటు చేయనున్నాం. రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి ఆయా మండలాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడుల సాధన, సాగులో మెళకువలు, విధి, విధానాల గురించి వివరిస్తాం. శాస్త్రవేత్తల ద్వారా కూడా శిక్షణ ఇస్తాం.

- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ, నల్లగొండ

కొత్త బాస్‌ల ముంగిట సవాళ్లు

సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా బాస్‌లు మారారు. కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందన దీప్తి, స్థానంలో నారాయణరెడ్డి, శరత్ చంద్రపవార్ బాధ్యతలు స్వీకరించారు. నిన్న మొన్నటి వరకు ఎన్నికల హడావుడి కొనసాగిన నేపథ్యంలో జిల్లాబాస్‌ల బదిలీలు ఆసక్తికరంగా మారాయి. రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా, జిల్లాలో మూలాలుండడంతో కొత్త బాస్‌లకు పాలన కత్తిమీద సాముగానే ఉంటుంది. అయితే ఒకేసారి జిల్లా బాస్‌లు ఇద్దరూ ట్రాన్స్‌ఫార్ కావడం చర్చనీయాంశంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

» రెవెన్యూ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కలెక్టర్ చొరవ తీసుకుంటారనే ఆశాభావం
» పీడీఎస్ బియ్యం, ఇసుక రవాణా నిరోధించాలనే సూచనలు
» గంజాయి, సెటిల్‌మెంట్ల నిరోధమే పోలీస్‌బాస్‌కి తక్షణ సవాల్
» కొత్త బాస్‌లపై ప్రజల్లో ఎన్నో ఆశలు



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్



సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి



నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్

ఎన్నికల కోలాహలం ముగిసిన తర్వాత ఇప్పుడిప్పుడే పాలన గాడిన పడుతున్న తరుణంలో జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలుగా నూతనంగా నియమితులైన అధికారులపై పెద్ద బాధ్యతలే ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో దాదాపు ఎనిమిది నెలలుగా పాలన నామమాత్రంగా కొనసాగిన నేపథ్యం, రాష్ట్ర ప్రభుత్వం మారడం, ప్రభుత్వ ప్రాధాన్యాలు మారిపోవడం, సమస్యల పరిష్కారంకోసం పలు రకాల సమస్యలు పేరుకొని ఉన్న తరుణంలో నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా సి.నారాయణరెడ్డి, ఎస్పీగా శరత్‌చంద్రపవార్, సూర్యాపేట కలెక్టర్‌గా తేజస్ నందాలాల్ పవార్, ఎస్పీగా సన్‌ప్రీత్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా పాలనాపగ్గాలు చేపట్టిన ఈ అధికారులపై జిల్లాల ప్రజానీకం ఎన్నోఆశలు పెట్టుకుంది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం, సుపరిపాలన అందించడంతోపాటు, ప్రభుత్వ ప్రాధాన్యాలను కొనసాగించడం అధికారుల ముందున్న తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.




రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ఆశలు

నల్లగొండ జిల్లాలో ధరణి అమల్లోకి వచ్చాక పలు సమస్యలు తెరపైకి వచ్చాయి. దాదాపు 20 శాతం మంది పట్టాదారులు ఏదో రకంగా ఇబ్బంది పడుతున్నారు. సరిహద్దు వివాదాలు, పేర్లు, సర్వే నెంబర్లు తప్పుగా పడడం, దశాబ్దాలుగా భూమి ఆధీనంలో ఉన్నా రికార్డుల్లో నమోదవకపోవడం, సాదాబైనామాలతో కొన్న భూములకు పట్టాదారులుగా నమోదవకపోవడంతో, ధరణి నమోదు సమయంలోనూ రికార్డులకెక్కించకపోవడం, అసైన్డ్‌భూములకు సంబంధించిన సమస్యలు, భాగపంపిణీలు, విరాసత్‌ల అమలు సక్రమంగా లేకపోవడం వంటి పలు సమస్యలు రెవెన్యూశాఖలో పేరుకుపోయాయి. జిల్లాకేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తోన్న ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో దాదాపు 60శాతం వరకు భూసంబంధిత అంశాలే ఉండడం ఇందుకు ఉదాహరణ. నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డికి ఇదే జిల్లాలో జాయింట్‌కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో భూవివాదాల పరిష్కారంలో, ల్యాండ్‌రికార్డుల ప్యూరిఫికేషన్ సమయంలో సమర్థవంతంగా వ్యవహరించారనే పేరుండడంతో ఈయన హయాంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశాభావం బాధితుల్లో వ్యక్తమవుతోంది. ఇందుకనుగుణంగానే కలెక్టర్ కూడా తొలి సమావేశంలోనే ఇకపై ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించారు. అదే విధంగా సమస్యలను తక్షణం పరిష్కరించాలనే ఆదేశాలివ్వడం ప్రజలకు సానుకూల సంకేతాలిచ్చినట్లయింది. వీటితోపాటు భూవివాదాలను సైతం ఫాస్ట్‌ట్రాక్‌గా పరిష్కరించాలనే సూచనలు వస్తున్నాయి. అటవీ, రెవెన్యూశాఖల మధ్య సరిహద్దు వివాదాలున్న అంశాలతోపాటు అటవీభూముల్లో గిరిజనులకు ఇచ్చిన పట్టాలకు సంబంధించి అటవీఅధికారుల అభ్యంతరాలతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల అడవిదేవులపల్లి మండలంలో గిరిజన రైతు అటవీ అధికారుల ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వీటితోపాటు కోట్లాది రూపాయల విలువైన దేవాదాయశాఖ, వక్ఫ్‌భూములు సైతం ఆక్రమణల్లో ఉన్నాయని, వాటిని సంరక్షించేందుకు సైతం కొత్త కలెక్టర్ చర్యలు తీసుకుంటారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల భూసేకరణ ప్రధాన సవాలే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీ అంతర్గత ఉదయసముద్రం-బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యతగా తీసుకొంది. ఇక్కడ కాల్వల నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో ప్రభుత్వానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించి ఇటు రైతులను, అటు ప్రభుత్వాన్ని మెప్పించేలా పనిచేయాల్సిన పరిస్థితి కలెక్టర్ ముందుంది. ప్రభుత్వం చెల్లిస్తామనే ధరకు, భూములు కోల్పోయే నిర్వాసితరైతులు ఆశిస్తున్న ధరలకు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండడంతో ఈ సమస్య పీటముడి పడుతోందని, తమకు న్యాయబద్ధమైన పరిహారం ఇవ్వాల్సిందేనని ఈ రెండు ప్రాజెక్టుల కింద నిర్వాసిత రైతులు ఆందోళనలు చేస్తున్న విషయం విదితమే.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి చర్యలు చేపట్టాలి




జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వకుండా నిరుపయోగంగా ఉన్న డబల్‌బెడ్‌రూమ ఇళ్ల పంపిణీకి కొత్త కలెక్టర్ శ్రీకారం చుట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు. జిల్లాలోని నల్లగొండ నియోజకవర్గంలో 710 ఇళ్లు, దేవరకొండలో 60ఇళ్లు, మిర్యాలగూడలో 640 ఇళ్లు, నకిరేకల్‌లో 534 ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపికతోపాటు, ఆయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పన జరగాల్సి ఉంది. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయి ఏడాది దాటిపోవడంతో తలుపులు, కిటికీలు ధ్వంసమవడంతోపాటు, ఇళ్ల మధ్యలో కంపచెట్లు పెరిగి శిథిలావస్థ నెలకొంది. తక్షణం మళ్లీ మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందించాలనే డిమాండ్ నెలకొంది.

ఆగిన బిల్లులకు మోక్షం కల్పించాలనే సూచనలు

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'మన ఊరు-మనబడి' పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులతోపాటు, జిల్లావ్యాప్తంగా నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణాలు పూర్తయినా బిల్లులందక చిన్న కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. వీటితోపాటు మునిసిపాలిటీలు, పంచాయతీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల వంటి పనులు హడావిడిగా చేయించి, ఆ తర్వాత ఎన్నికల కోడ్ నెపంతో బిల్లులు ఆపేయడంతో రూ.కోట్లు ఆగిపోయి, చిరు కాంట్రాక్టర్లు అవస్థలు పడుతున్నారు. వీటిపైనా సమీక్ష నిర్వహించి గాడిన పెట్టాలని కోరుతున్నారు.


పీడీఎస్ అక్రమాలు, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం పెట్టాలనే సూచనలు



రాష్ట్రవ్యాప్తంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ఎక్కడ పట్టుబడినా నల్లగొండ జిల్లాలోనే మూలాలుంటున్న ఘటన జిల్లా ప్రతిష్టను మసకబారుస్తుందని, ఈ అక్రమ దందాపై నూతన కలెక్టర్ ఉక్కుపాదం మోపాలనే సూచనలు వస్తున్నాయి. పేదలకు అందాల్సిన బియ్యం పేదలకే అందేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇటీవల ఏకంగా స్టేజ్-2 రవాణా కాంట్రాక్టరే ఈ అక్రమ రవాణాలో పట్టుబడడం జిల్లాలో వేళ్లూనుకుపోయిన ఈ దందాకు నిదర్శనంగా చెప్పవచ్చు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా పాతుకుపోయిన ఇసుక మాఫియాను కట్టడి చేయాలనే సూచనలు వస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక సరైన ఇసుక పాలసీ లేకపోవడం, స్థానిక అవసరాలకు స్థానిక ఇసుకను వాడుకోవచ్చనే ప్రభుత్వ నిర్ణయంతోపాటు, ప్రభుత్వ పనుల కోసం కేటాయించిన ఇసుక అనుమతుల పేరుతో జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రధానంగా అధికారపార్టీకి చెందిన చోటా నాయకులు, పోలీసులతో కలిసి అక్రమంగా ఈ దందాని సాగిస్తుండడంతో అదుపులేని పరిస్థితి ఏర్పడింది. మైనింగ్ శాఖకు ఆదాయం కోల్పోతుంటే, జలవనరులు తగ్గిపోయే దుస్థితి ఈ దందాతో నెలకొంది.

పంచాయతీల పాలనపై ప్రత్యేక దృష్టి

గ్రామపంచాయతీల్లో పాలకవర్గాల గడువు ముగిశాక ప్రత్యేకాధి కారుల పాలన సాగుతోంది. వరుస ఎన్నికల నేపథ్యంలో పంచాయతీల్లో పాలన పడకేసింది. పారిశుధ్య నిర్వహణ, మొక్కల పెంపకం సవ్యంగా లేకపోవడంతో గ్రామాలు బోసిపోయాయి. ప్రధానంగా నర్సరీల నిర్వహణ లోపభూయిష్టంగా తయారైంది. మల్టీపర్పస్ వర్కర్ల కొనసాగింపుపై సందిగ్ధం కొనసాగుతుండడం, అజమాయిషీ లోపించడంతో గ్రామాల్లో సేవలందడంలేదు. వేసవిలో తాగునీటి ఎద్దడి పేరుతో పలుచోట్ల కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ఇష్టారీతిన బిల్లులు చేశారనే ఆరోపణలున్నాయి. వీటిన్నింటిపైనా కలెక్టర్ దృష్టి సారించి గ్రామాలలో పాలనను బలోపేతం చేయాలనే సూచనలు వస్తున్నాయి.



గంజాయి నియంత్రణ, సెటిల్‌మెంట్ల నిరోధమే ఎస్పీ ముందున్న సవాల్



జిల్లాలో విచ్చలవిడిగా పెరిగిపోయిన గంజాయి విక్రయాలు, వినియోగాన్ని నియంత్రించాల్సిన తక్షణ కర్తవ్యం కొత్త ఎస్పీ శరత్‌చంద్రపవార్ ముందుంది. ఏపీ నుంచి జిల్లాకు భారీగా గంజాయి సరఫరా అవుతోంది. జిల్లా కేంద్రంతోపాటు, పట్టణాలు, మండల కేంద్రాల్లో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. మిర్యాలగూడ లాంటి పట్టణాల్లో యువతకు గంజాయితో పాటు డ్రగ్స్ కూడా అందుబాటులో ఉండడంతో వారంతా గ్యాంగులుగా మారి విచ్చలవిడిగా గొడవలకు దిగుతూ ప్రజల్ని, కాలనీల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న పరిణామాలు వెలుగులోకి వస్తున్నాయి. అదేవిధంగా వలస కార్మికులు అధికంగా ఉన్న దామరచర్ల ప్రాంతంలో గంజాయి విక్రయాల మోతాదు ఎక్కువగా ఉందనే ఫిర్యాదులున్నాయి. పోలీస్‌శాఖలోనే కొందరు సిబ్బంది, మరికొందరు రాజకీయ నాయకులు గంజాయి రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అదేవిధంగా పోలీస్‌శాఖ ప్రక్షాళన పైనా కొత్తబాస్ దృష్టిపెట్టాలనే సూచనలు వస్తున్నాయి. ప్రధానంగా రియల్ దందాలు, భూసెటిల్‌మెంట్లు చేస్తున్న వారు ఎక్కువయ్యారనే అంశంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పలు స్టేషన్లను రాజకీయ నేతల కనుసన్నల్లో సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా మార్చారని, అలాంటి పరిస్థితిని తొలగించాలని కోరుతున్నారు. కానిస్టేబుళ్ల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు, అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి చర్యలు తీసుకోవాలనే కోరుతున్నారు.

ఎస్పీగా బాధ్యతల స్వీకరణ



నల్లగొండ, జూన్ 18: జిల్లా ఎస్పీగా శరత్ చంద్ర పవార్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్పీగా పనిచేసిన చందనా దీప్తి సికింద్రాబాద్ రైల్వే ఎస్పీగా బదిలీ కాగా.. 2016 బ్యాచ్‌కు చెందిన శరత్‌చంద్ర పవార్‌ను ఎస్పీగా నియమించిన సంగతి తెలిసిందే. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌చంద్ర పవార్‌కు అదనపు ఎస్పీ రాహుల్‌నాయక్, ఎస్బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, గిరిబాబు, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాస్, ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు.

28న డిండి ప్రాజెక్టు నీటి విడుదల

డిండి, జూన్ 18: ఈ నెల 28న డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేయనున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు గరిష్ఠనీటిమట్టం 36 అడుగులుకాగా ప్రస్తుతం 26(1.3 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉంది. డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని 12,500 ఎకరాలకు ఈ వానకాలం రెండు నెలల వరకు నీరు సరిపోతుందని నీటిపారుదలశాఖ ఈఈ శ్రీధర్‌రావు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ఐక్యంగా ముందుకు సాగుదాం

● ప్రతీ సోమవారం మండలస్థాయిలోనూ ప్రజావాణి ● కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, జూన్ 18: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించినట్లుగానే, ఇకపై మండలస్థాయిలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నూతన కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. వచ్చే సోమవారం నుంచి మండలస్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, ఇందుకుగాను మండలస్థాయిలో అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమావేశమై రెవెన్యూ అంశాలతోపాటు, ఇతర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు చొరవ చూపించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ ఆర్డీవోలు రవి, శ్రీనివాసరావు, శ్రీరాములు పాల్గొన్నారు.







మరో వారం రోజుల్లో..

● పులిచింతల మరమ్మతులు పూర్తి

మేళ్లచెర్వు, జూన్ 18: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టులో 96.17 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, 95అడుగుల నీటి మట్టం ఉంచేవరకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 96.17 అడుగులుగా (0.49 టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి వరద రాకపోగా, 1621 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ 119.22అడుగులు (3.61 టీఎంసీలు) కాగా, ప్రాజెక్టు ప్రారంభించిన 2013 సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో మొదటిసారి ప్రాజెక్టు నీటిమట్టం డెడ్ స్టోరేజీ కంటే తగ్గింది. దీంతో ప్రాజెక్టు అడుగుబాగాన ఉన్న అండర్ గ్రౌండ్ గేట్ల మరమ్మతులకు ఆటంకం కలగకుండా ప్రాజెక్టు నీటిమట్టం 95 అడుగులు(29 మీటర్లు) చేరుకునే వరకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రేడియల్ క్రస్టు గేట్లు (24) పూర్తిస్థాయిలో మరమ్మత్తులు పూర్తికావటంతో ప్రాజెక్టు అడుగు బాగాన అండర్ గ్రౌండ్‌లో ఉన్న 8 గేట్లకు రబ్బర్ స్టీల్‌తో పాటు రోప్ వైర్లను పూర్తిగా మార్చటం జరుగుతుందని, ఈ ప్రక్రియ మరో వారం, పది రోజుల్లో పూర్తి అవుతుందని, దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి మరమ్మతులు పూర్తి అవుతాయని ప్రాజెక్టు డీఈ అరుణ తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి


● తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి

సూర్యాపేటరూరల్, జూన్ 18: తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని మీడియా అకాడమి రాష్ట్ర చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మంలో జరిగే టీయూడబ్ల్యూజే(ఐజేయూ)రాష్ట్ర మహాసభలకు వెళుతూ మార్గమధ్యలో సూర్యాపేటలో ఆగి విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇళ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని జర్నలిస్టులకు ఓ నమ్మకం, విశ్వాసం ఏర్పడిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో 24వేల అక్రిడిటేషన్లు ఉన్నాయన్నారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్‌అలీ, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కొణిజేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కోలా నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు కృష్ణ, బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.
















జనసందోహం..'గిరి' ప్రదక్షిణం

● ప్రతిధ్వనించిన నారసింహ నామం

భువనగిరి అర్బన్, జూన్ 18: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో ఆనవాయితీగా వస్తున్న గిరిప్రదక్షిణ మంగళవారం అంచనాలకు మించి భక్తులు పాల్గొని ఏకశిఖరవాసుని పట్ల తమ భక్తిని చాటుకున్నారు. గిరిప్రదక్షిణతో మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నమో నారసింహా అంటూ భక్తుల జయ జయ ధ్వానాల మధ్య దశ దిశలా ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన గిరి ప్రదక్షిణలో సుమారు 10వేల మంది భక్తులు పాల్గొన్నారు. పండుగలా సాగిన ప్రదక్షిణలో మార్గం మొత్తం జనసంద్రంగా మారింది. నడక దారిలో జనసందోహం నెలకొనగా కళాకారుల సంప్రదాయ నృత్యాలతో ప్రదక్షిణ వెంట కదిలారు. వేకువజాము నుంచి భక్తులు ఒక్కొక్కరుగా వైకుంఠ ద్వారం చేరుకోగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల




గిరిప్రదక్షిణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య, ఆలయ ఈవో భాస్కర్‌రావు, ప్రదక్షిణలో పాల్గొన్న జనవాహిని

అయిలయ్యతో పాటు ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి అక్కడ ప్రత్యేక పూజల అనంతరం వేదమంత్రాల నడుమ అర్చకస్వాములు హారతి ఇచ్చారు. ఆ తర్వాత యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలంతో కలిసి గిరిప్రదక్షిణకు బయలుదేరగా వీరి వెంట ఆశేష భక్తజనం విశేషంగా ముందుకు కదిలారు. యాదగిరిపై కొలువైన లక్ష్మీసమేతుడి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం మంగళవారం రోజున సుమారు రెండు వేల మంది భక్తులతో వైకుంఠ ప్రాంతమంతా జనసంద్రంగా మారగా, గిరిప్రదక్షిణను విప్ బీర్ల ప్రారంభించారు. అరుణాచలం, సింహాచలం మాదిరిగా యాదగిరిగుట్టలో గిరిప్రదక్షిణ నిర్వహించడం విశేషంగా భక్తులు భావించారు. ఉదయం 5.30గంటలకు భక్తజనులతో వైకుంఠ ద్వారం నుంచి బయలుదేరి కొండచుట్టు సుమారు 2 కిలోమీటర్ల మేర 45నిమిషాల పాటు సాగగా తిరిగి వైకుంఠ ద్వారం చేరుకునే సరికి 5వేల మందికి చేరుకుంది. ఉదయం 11గంటల వరకు ఆ రద్దీ అలాగే కొనసాగిన ప్రదక్షిణలతో సుమారు మొత్తం 10వేల మంది భక్తులు పాల్గొని వైకుంఠ ద్వారం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. భారీ సంఖ్యలో చేరుకున్న భక్తజన సందోహం మధ్య వైకుంఠ ద్వారం గుండా మెట్ల దారివెంట కొండపైకి ఉచిత దర్శనం క్యూలైన్ల ద్వారా తూర్పు రాజగోపురం నుంచి గర్భాలయంలోకి చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కీర్తి ప్రతిష్ఠలు విశ్వవ్యాప్తం అయ్యేలా మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా విస్తృతం చేయాలని ప్రభుత్వ విప్ అయిలయ్య ఆకాంక్షించారు. అందుకోసం కొండపైన పాత ఆచారాలను పునరుద్ధరిస్తున్నట్లు, భక్తుల రాక పెంచేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ప్రతీ నెలా స్వాతినక్షత్రం రోజున దేవస్థానం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గిరిప్రదక్షిణ కొనసాగనున్నట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్‌కుమార్ నేతృత్వంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్ పర్యవేక్షించగా ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా కోలాటం వేస్తున్న మహిళా భక్తులు

విషాదంగా మారిన ప్రేమ పెళ్లి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, చిరంజీవి(ఫైల్‌ఫొటో)

● భర్త వేధింపులు భరించలేక కుటుంబ సభ్యులతో కలిసి హత్య

పాలకవీడు, జూన్ 18: వారిద్దరూ ప్రేమించుకుని పెద్దలకు తెలియకుండా 15ఏళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకోగా, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేశారు. భర్త అప్పులు చేయడంతో ఇద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. భర్త వేధింపులు తీవ్రతరం కావడంతో మూడునెలల క్రితం భార్య పుట్టింటికి వచ్చింది. మద్యం మత్తులో అత్తగారింటికి వచ్చిన భర్త ఆమెను చంపేస్తానని బెదిరించాడు. ఆమె కుటుంబసభ్యులు తాళ్లతో బంధించి రాళ్లు, కర్రలతో దాడి చేయటంతో మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. స్థానికులు, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం పాలకవీడు మండలం మూసీఒడ్డుసింగారం గ్రామానికి చెందిన ఆరుట్ల చిరంజీవి(41), ఈ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన అరుణ కోదాడ కేఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ చదివారు. ఒకే సామాజికవర్గానికి చెందిన వీరిద్దరూ ప్రేమించుకుని తల్లిదండ్రులకు తెలియకుండా వివాహం చేసుకుని హైదరాబాద్‌లో కాపురంపెట్టారు. పెళ్లి తర్వాత చిరంజీవి ఎంబీఏ చదవగా, అరుణ ఎమ్మెస్సీ(బాటనీ), బీఈడీ చదివింది. చిరంజీవి వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేయగా, అరుణ ప్రైవేట్ పాఠశాలలో పనిచేసింది.పెళ్లయిన ఐదేళ్ల తర్వాత కుటుంబసభ్యులకు చేరువై మూసీఒడ్డుసింగారంలోనే ఉంటున్నారు. అప్పటికి వీరికి కుమార్తె ఉంది. ఆ తర్వాత కుమారుడు జన్మించాడు. ఐదేళ్ల నుంచి చిరంజీవి ఏ ఉద్యో గం చేయడం లేదు. మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణకు రూ.12 లక్షల వరకు అప్పుచేశాడు. ఈ అప్పును పుట్టింటి నుంచి తీర్చాలని భార్యపై ఒత్తిడి తెస్తున్నాడు. ఇద్దరి మధ్య వివాదాలు పెరగటంతో వీరి తగాదాను అప్పుడప్పుడు పెద్ద మనుషులు పరిష్కరించేవారు. తర్వాత యథావిధిగా తగాదాలు జరిగాయి.

మూడు నెలల క్రితం పిల్లలతో పుట్టినింటికి...

ఈ నేపథ్యంలో చిలుకూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయురాలిగా అరుణ చేరింది. ఆ పాఠశాలకు చిరంజీవి వెళ్లి గొడవ పెట్టుకోవడంతో అరుణ అక్కడ ఉద్యోగం మానేసి మూడు నెలల క్రితం పిల్లలను తీసుకుని గుడుగుంట్లపాలెంలోని పుట్టినింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం నేరేడుచర్లలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరింది. సోమవారం చిరంజీవి ఆ పాఠశాలకు వెళ్లి అక్కడి ఉపాధ్యాయులతో గొడవపడ్డాడు. గుడుగుంట్లపాలెంలో ఉంటున్న అరుణ ఇంటికి సోమవారం అర్ధరాత్రి 1.30 సమయంలో వెళ్లాడు. అరుణతో పాటు ఆమె కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉన్నారు. గమనించిన చిరంజీవి భార్య నిద్రిస్తున్న గది తలుపును బలవంతంగా తెరచి, ఆమె గొంతుపై కత్తి పెట్టాడు. అరుణకు మెలకువ వచ్చి అరిచేందుకు యత్నించగా.. చంపేస్తానని బెదిరించాడు. ఆమె పక్కనే ఉన్న పిల్లలు నిద్రలేచి వద్దు నాన్నా.. అంటూ అరవడంతో కుటుంబసభ్యులందరూ మేల్కొన్నారు. దగ్గరకు వస్తే చంపుతానని వారందరినీ చిరంజీవి బెదిరించాడు. ఆ అలికిడికి ఆ ఇంటి పక్కనే నివసిస్తున్న అరుణ బాబాయిలు, వారి బంధువులు వచ్చారు. అందరూ కలిసి చిరంజీవిని తాళ్లతో బంధించారు. భార్య అరుణతో పాటు రాళ్లు, కర్రలతో చిరంజీవిపై దాడి చేయడంతో రాత్రి 2.30గంటలకు అపస్మారక స్థితికి వెళ్లాడు. అరుణ కుటుంబ సభ్యులు 108అంబులెన్సుకు సమాచారం ఇవ్వగా వేకువజామున 3.30గంటలకు 108 సిబ్బంది వచ్చి పరిశీలించి చిరంజీవి మృతి చెందినట్లు నిర్ధారించి వెనుదిరిగి వెళ్లారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు హుజూర్‌నగర్ సీఐ ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిరంజీవి సోదరుడు ఆరుట్ల నరేందర్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన భార్యతో పాటు మరో తొమ్మిది మంది కుటుంబ సభ్యులపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నింగీ.. నేల కలిసేలా... మనసు మురిసేలా

● ట్రావెల్ ఫొటోగ్రఫీలో జాతీయస్థాయి సిల్వర్‌మెడల్ సాధించిన ప్రదీప్

మాడ్గులపల్లి, జూన్ 18: ఎత్తైన పర్వత శ్రేణులు.. పచ్చ దనం పరుచుకున్న కొండపై మంచు.. నింగీ నేల ఒకేచోట చూస్తే ఎవరికైనా మనసు పరవశిస్తుంది... హిమాచల్‌ప్రదేశ్‌లోని ఈ అద్భుత దృశ్యాన్ని తన కెమెరాలో బంధించిన నల్ల గొండ జిల్లా ఫొటోగ్రాఫర్‌కు జాతీయ స్థాయిలో పురస్కారం దక్కింది. ట్రావెల్ ఫొటోగ్రఫీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో నల్లగొండ జిల్లా మాడ్గులపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ మారేపల్లి ప్రదీప్ జాతీయస్థాయి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు,మనాలిలో సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో అడ్వాన్స్ ఫొటోగ్రఫీ, అడ్వెంచర్, పిక్టోరియల్, ట్రావెల్ ఫొటోగ్రఫీ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 40మంది ఫొటోగ్రాఫర్లు హాజరయ్యారు. ట్రావెల్ ఫొటోగ్రఫీ విభాగంలో ప్రదీప్ తీసిన హిమాచల్‌ప్రదేశ్‌లోని రోతంగ్‌పాస్ ప్రాంతానికి సంబంధించిన ఫొటోకు జాతీయస్థాయి సిల్వర్ మెడల్ లభించింది. ఈ నెల 12వ తేదీన మనాలిలో సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ నుంచి ప్రదీప్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లలో ప్రతిభను వెలికితీయడానికి జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించడం ద్వారా గ్రామీణ ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు.




మారేపల్లి ప్రదీప్ తీసిన హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని రోతంగ్‌పాస్ వద్ద ప్రాంతం ఫొటో, సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రదీప్

అతి వేగానికి ఇద్దరు బలి

● రోడ్డు దాటుతున్న బైక్‌ను ఢీకొట్టిన మరో వాహనం

● కుమార్తె మృతి, తండ్రికి గాయాలు

● బైక్‌తో ఢీకొట్టిన యువకుడు అక్కడికక్కడే మృతి

కనగల్, జూన్ 18 : అతి వేగం, నిర్లక్ష్యం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. ద్విచక్ర వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తుండగా మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ వాహనంపై వెళ్తున్న కుమార్తె మృతి చెందగా, తండ్రి గాయపడ్డాడు. వాహనంతో ఢీకొట్టిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిడమనూరరు మండలం గోవిందన్నగూడెం గ్రామానికి చెందిన కొండ కృష్ణయ్య, ఆయన పెద్దకుమార్తె అరుంధతి(22)తో కలిసి నల్లగొండ పట్టణంలోని అయ్యప్పగుడికి దైవదర్శనం కోసం ఇంటి నుంచి మంగళవారం తెల్లవారుజాము 5.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో బాబాసాయిగూడెం గ్రామ స్టేజీ వద్ద నల్లగొండ-సాగర్ హైవే రోడ్డుపైకి వీరి వాహనం వస్తున్న క్రమంలో తిరుమలగిరి(సాగర్) మండలానికి చెందిన బత్తుల పవన్‌కుమార్(23) పల్సర్‌బైక్‌పై అతి వేగంగా నల్లగొండ వైపునకు వస్తూ వీరిని వెనకనుంచి ఢీకొట్టాడు. దీంతో కృష్ణయ్య, అరుంధతి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా పవన్‌కుమార్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన తండ్రీ కుమార్తెలను స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అప్పటికే అరుంధతి మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. గాయపడిన కృష్ణయ్యకు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పవన్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అరుంధతి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. అరుంధతి డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతుండగా, పవన్ తిరుమలగిరి(సాగర్)లోని ఓ హోటల్‌లో వంటమనిషిగా పనిచేస్తున్నాడు.



రోడ్డుపై కృష్ణయ్య, మృతుడు పవన్(ఫైల్‌ఫొటో)



తిరుమలగిరి(సాగర్)లో విషాదఛాయలు

తిరుమలగిరి(సాగర్): నాగార్జునసాగర్-నల్లగొండ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రానికి చెందిన యువకుడు బత్తుల పవన్‌కుమార్(23) మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పవన్‌కుమార్ సోమవారం సాయంత్రం చెర్వుగట్టు వద్ద ఉన్న రామలింగేశ్వరస్వామి దర్శనానికి నల్లగొండలో స్నేహితుడి బైక్‌పై వెళ్లి తిరుమలగిరి వచ్చాడు. అనంతరం మంగళవారం తెల్లవారుజామున స్నేహితుడి వాహనాన్ని తిరిగి ఇచ్చేందుకు నల్లగొండకు బయలుదేరి ప్రమాదానికి గురై మృతి చెందాడు. స్థానిక హోటల్‌లో పనిచేస్తూ అందరితో కలివిడిగా ఉండే పవన్ మృతితో అతడి బంధువులు, స్నేహితులు, స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా యూజీసీ నెట్ పరీక్ష

నల్లగొండ, జూన్ 18: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నెట్ ప్రవేశపరీక్ష మంగళవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఆల్ఫా జూని యర్ కళాశాల, నలంద ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 1,119మంది విద్యార్థులకు 921మంది హాజరయ్యారు. ఉదయం 9.30గంటల నుంచి 12.30గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు పర్యాయాలు నిర్వహించినట్లు ఎన్‌టీఏసీటీ కోఆర్డినేటర్ పార్థసారధి తెలిపారు.

సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండటౌన్, జూన్ 18: షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి హైదరాబాద్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్(10 నెలల రెసిడెన్షియల్) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 100మందిని రాత పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి జులై 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కూడా గ్రూప్స్‌కు సిద్ధమయ్యే బీసీ అభ్యర్థులకు కూడా ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

భూవివాదం కేసులో పోలీసులు వేధిస్తున్నారు

● పోలీస్‌స్టేషన్ ఆవరణలో రైతు ఆత్మహత్యాయత్నం

నిడమనూరు, జూన్ 18: భూవివాదం కేసులో పోలీసులు వేధిస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ రైతు పోలీస్‌స్టేషన్ ఆవరణలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మంగళవారం నల్లగొండ జిల్లా నిడమనూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ సంఘటన జరిగింది. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిడమనూరు మండలం ఎర్రబెల్లికి చెందిన తుంగతుర్తి వెంకటాచారి(65) ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. మాడ్గులపల్లి మండలం ధర్మాపురం శివారులో 1.16 గుంటల భూమి ఉండగా, 14 ఏళ్ల క్రితమే తమ బంధువులైన మాడ్గులపల్లి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన దేశోజు కనకాచారి సోదరులకు విక్రయించాడు. అప్పట్లో వారు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోయినా, భూమి మాత్రం కనకాచారి సోదరుల కబ్జాలోనే ఉంది. భూమి విషయంలో వెంకటాచారికి, కనకాచారి సోదరుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ విషయమై పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగారు. ఆ భూమికి ఇటీవల కనకాచారి సోదరులు ఏర్పాటుచేసిన ప్రహరీని వెంకటాచారి ధ్వంసంచేశాడు. దీంతో కనకాచారి సోదరులు ఈ నెల 13న ఫిర్యాదు చేయడంతో వెంకటాచారి, ఆయన కుమార్తె ధనలక్ష్మి, అల్లుడు యదగిరి,ట్రాక్టర్ డ్రైవరు శ్రీనివాస్‌పై నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో నాలుగురోజులుగా స్టేషన్‌కు రప్పిస్తుండటంతో మనస్తాపానికి గురైన వెంకటాచారి మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన పోలీసులు డబ్బాను లాక్కొని ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి అక్కడి నుంచి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వెంటిలేటర్ సౌకర్యం లేకపోవటంతో చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంకటాచారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ గోపాల్‌రావును వివరణ కోరగా, కనకాచారి ఫిర్యాదు మేరకు వెంకటాచారితో పాటు మరో ముగ్గురిపై ఈ నెల 13వ తేదీన కేసు నమోదు చేశామన్నారు. తాము వేధించామన్న ఆరోపణలను ఎస్ఐ ఖండించారు. వెంకటాచారిని తాము స్టేషన్‌కు పిలవలేదని, ఆయన క్రిమిసంహారక మందు తాగి స్టేషన్ లోపలికి రాగానే గమనించి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



చికిత్స పొందుతున్న రైతు వెంకటాచారి

ఆకాశం వర్ణమయం



కాషాయ రంగును పులుముకుందా అన్నట్లుగా నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఆకాశం కనిపించింది. సూర్యాస్తమయ వేళలో బంగారు, కాషాయ రంగుల్లో వెలుగులు స్థానిక రామాలయానికి మరింత శోభను తెచ్చిపెట్టాయి.

కొండ్రపోల్ ఊరచెరువును కాపాడండి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కొండ్రపోల్ గ్రామస్థులు

మిర్యాలగూడ, జూన్ 18 : తమ గ్రామ ఊరచెరువును కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామస్థులు కోరారు. వారంతా మంగళవారం సేవ్ కొండ్రపోల్ ఊరచెరువు పేరుతో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేళ్ల నుంచి 178.30 ఎకరాల్లో విస్తరించిన ఊరచెరువు 1,000 ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తుందన్నారు. చెరువులో చేపలు పెంచి విక్రయిస్తూ 100 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. చెరువులో నీరు లేకపోవడంతో 50ఎకరాల చెరువు భూమిని కబ్జా చేశారన్నారు. చెరువు విస్తీర్ణం తగ్గడంతో సాగు నీరందే పరిస్థితి ఉండదని, ఇలానే కొనసాగితే మత్స్యకార కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుకు హద్దులు నిర్ణయించి కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కొండ్రపోల్ గ్రామస్థులు మట్టారెడ్డి, పాపయ్య, సురేష్, రవితేజ, సోమయ్య, పుల్లయ్య, షైనయ్య, నగేశ్, బండి సైదులు, సంజీవ, లక్ష్మయ్య, మట్టయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

దేవరకొండ, జూన్ 18 : గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో పూటగడవక వారు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగరాజు, అంజయ్య, పుష్పమ్మ, లక్ష్మి, మోత్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 18 : గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘ నాయకులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్‌నాయక్ మాట్లాడుతూ వివిధ కేటగిరీలలో ఉన్న ఉపాధ్యాయులకు రోస్టర్ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. అన్‌ట్రైన్డ్ టీచర్స్‌కు డేట్ ఆఫ్ జాయినింగ్ పరిగణలోకి తీసుకుని ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హరినాయక్, శంకర్‌నాయక్, వేదశ్రీ, బద్దునాయక్, రాంజీ, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర



నల్లగొండలో శోభాయాత్ర నిర్వహిస్తున్న అభిమానులు

నల్లగొండ కల్చరల్, జూన్ 18 : ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగిన రోజు సందర్భంగా హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం నుంచి శివాజీనగర్ వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో శివాజీ విగ్రహాన్ని ఊరేగించారు. శోభాయాత్ర బోయవాడ, బస్టాండ్, క్లాక్‌టవర్, రామగిరి సెంటర్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా శివాజీనగర్ శివాజీ విగ్రహం వరకు సాగింది. పలువురు వక్తలు ఛత్రపతి హిందూ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ర్యాలీని జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టెగొమ్ముల రవీందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి సంగపాక రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నరేందర్, దీపక్, సిద్ధు, ఫణితో పాటు శివాజీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ లభ్యం

దేవరకొండ, జూన్ 18:కొండభీమనపల్లి శివారులో మంగళవారం గుర్తించిన మృతదేహం నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ గ్రామానికి చెందిన ముదిగొండ లింగం అనే వ్యక్తిది అని సీఐ నరసింహులు తెలిపారు. కొన్నేళ్ల నుంచి లింగం మతిస్థిమితం సరిగాలేక ఇంటి నుంచి వెళ్లి మూడు, నాలుగు రోజులకు వెళ్తుంటాడని తెలిపారు. అలా ఈ నెల 14న వెళ్లిన లింగం 17వ తేదీన కొండభీమనపల్లిలో శవమై కనిపించాడన్నారు. పత్రికల్లో వచ్చిన కథనాలతో భార్య అనురాధ భర్తను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చిందన్నారు. లింగంకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం చెల్లించాలి





మిర్యాలగూడ, చింతపల్లిలో ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఏఐటీయూసీ నాయకులు

మిర్యాలగూడ, జూన్ 18 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద అంగన్‌వాడీలకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. గతంలో 24రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలన్నారు. 60 ఏళ్ల లోపు వారికి వీఆర్‌కు అనుమతించాలన్నారు. అంగన్‌వాడీలో కారుణ్యనియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బీ.రాణి, ఎం వనజ, ఆర్‌జ శ్రీదేవి, ఎం సాజును తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు శాంతాబాయి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీడీపీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ప్రాజెక్టు అధ్యక్షురాలు మణెమ్మ, భాగ్య, స్వప్న, వెంకటమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి: కాంగ్రెస్ పార్టీ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీడీపీవో లావణ్యకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యురాలు రమణ మాట్లాడుతూ అంగన్‌వాడీలను పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యురాలు అంజలి, పద్మావతి, ప్రమీల పాల్గొన్నారు.

కలెక్టర్ నారాయణరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్ నారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, సీపీఐ నాయకులు నెల్లికంటి సత్యం, లొడంగి శ్రావణ్‌కుమార్

నల్లగొండ/ నల్లగొండ టౌన్ / నల్లగొండ రూరల్, జూన్ 18 : నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ సీ నారాయణరెడ్డిని మంగళవారం పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలు, బొకేలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జడ్పీచైర్మన్ బండా నరేందర్ రెడ్డి, సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో బీ శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు ఉన్నారు. అదేవిధంగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంగోతు ప్రవీణ్‌నాయక్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కేతావత్ నగేష్‌నాయక్, బంజారా సంఘం లీగల్ అడ్వైజర్ నాగార్జున, ఉపాధ్యక్షులు అమర్‌సింగ్‌నాయక్, డీసీసీ ప్రధానకార్యదర్శి ధరావత్ బాల్‌సన్‌నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ సత్యనాయక్, ప్రచార కార్యదర్శి రమావత్ రవినాయక్, మాజీ సర్పంచ్ నరసింహనాయక్ ఉన్నారు. బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసోజు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు కంది సూర్యనారాయణ, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్‌ముదిరాజ్, కార్యదర్శి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు గుండా కోటప్ప, కార్యదర్శి ఎల్లంరాజు, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ ప్రసాద్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మధు యాదవ్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అదేవిధంగా కలెక్టర్ నారాయణరెడ్డిని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గసభ్యులు బొల్లగూరి నర్సింహ, టీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఇరిగేషన్ పనులు వేగంగా పూర్తిచేయాలి



దేవరకొండలోని స్వర్ణముఖి కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 18 : శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి పనులను వేగంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నీటి పారుదల శాఖ, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టుల ఎస్ఈ, ఈఈలు, డీఈలు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులకు రూ.2500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. భూసేకరణ, పునరావాసం ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. డిండి కాల్వల ఆధునికీకరణ ప్రతిపాదనను సిద్ధం చేయాలన్నారు. నక్కలగండి రిజర్వాయర్ ముంపు బాధితులకు పునరావాసం కల్పించి 10 శాతం పనులను పూర్తి చేయాలన్నారు. శ్రీశైలం సొరంగమార్గం పనులను తిరిగి పునఃప్రారంభించాలని సూచించారు. ప్రాజెక్టుల పురోగతిని, వివరాలను ఎస్ఈ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. సమీక్షా సమావేశంలో నీటి పారుదల శాఖ ఈఈలు యాదన్‌కుమార్, శ్రీధర్‌రావు, సత్యనారాయణ, చక్రపాణి, కరుణసాగర్, అధికారులు, పాల్గొన్నారు.

దేవరకొండ పట్టణ అభివృద్ధికి కృషి

దేవరకొండ పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. పట్టణంలోని 15, 16, 1, 13 వార్డుల్లో కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వర్ణముఖి కాల్వను పరిశీలించి పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. దేవరకొండ ఖిల్లాలో పార్క్ నిర్మాణ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్‌చైర్మన్ రహత్‌అలీ, ఏఈ రాజు, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పున్న వెంకటేష్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు భూదేవిసైదులు, జయప్రకాష్, గాజుల మురళీ పాల్గొన్నారు.

ప్రయాణికుల సహకారం అవసరం: ఆర్టీసీ డీఎం

మిర్యాలగూడ టౌన్, జూన్ 18 : సంస్థ అభివృద్ధికి ప్రయాణికుల సహకారం అవసరమని ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ అన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా ప్రయాణికుల నుంచి సమస్యలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అన్నిరూట్లలో ఆర్టీసీ బస్సులను నడిపే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులు రక్షణ, భద్రత లేని ప్రైవేటు రవాణా వ్యవస్థను ప్రోత్సహించకుండా ఆర్టీసీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు భారతీభాయి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెన్నకేశవస్వామి ఆలయ భూముల కౌలు వేలం

అడవిదేవులపల్లి, జూన్ 18: మండలకేంద్రంలో కొలువైన చెన్నకేశవస్వామి ఆలయ భూముల కౌలు వేలాన్ని ఈ నెల 19న మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి మేనేజర్ కొంకపాక మృత్యుంజయశాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సర్వే నెంబర్లలోని ఆలయానికి సంబంధించిన 45.61ఎకరాల భూమి కౌలు వేలాన్ని బుధవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నామని, ఆసక్తిగలవారు రూ.5వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

నల్లగొండ కల్చరల్: అనుముల మండలం మారేపల్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించి ప్లాట్ నెంబరు 1 నుంచి 70 వరకు గల 189 ఎకరాల 33 గుంటల భూమి ఏడాది కౌలుకు ఈ నెల 19వ తేదీన కనగల్ రైతు వేదిక భవనంలో వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఏసీ మహేంద్రకుమార్, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి ఒక ప్రకటలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

మిషన్ భగీరథ సర్వేకు సహకరించాలి

మర్రిగూడ, జూన్ 18 : మిషన్ భగీరథ సర్వేకు ప్రజలు సహకరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో భగీరథ నీటి సరఫరాపై ఇంటింటికీ తిరిగి ఆధార్‌ను నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 50శాతం సర్వే పూర్తయ్యిందని, ఈ నెల 20లోగా సర్వే పూర్తిచేస్తామన్నారు. ఆయన వెంట గ్రామకార్యదర్శి యూసుఫ్, పలువురు ఉన్నారు.

గ్రామీణులను చైతన్యంచేయాలి

కేతేపల్లి, జూన్ 18 : నులి పురుగుల నివారణపై ఆశా వర్కర్లు గ్రామీణులను చైతన్యం చేయాలని మండల వైద్యాధికారి అర్చన అన్నారు. కేతేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన, వ్యాధుల నియంత్రణపై ఆశావర్కర్లకు ఒకరోజు శిక్షణా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ ఈ నెల 20న అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌బాడీ కేంద్రాల్లో 19 ఏళ్ళ లోపు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు సుందర్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి, కమలమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా కలెక్టర్‌ను కలిసిన చొక్కారావు

నల్లగొండ రూరల్, జూన్ 18 : సూర్యాపేట జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న వెంకటరావుతో పాటు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌ను డ్యాబ్ ప్రధాన కార్యదర్శి, ఏఐసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు కలిశారు. వెంకటరావును సన్మానించారు. నందలాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చొక్కారావు వెంట పెండ్యాల దామోదర్‌రావు ఉన్నారు.



మిర్యాలగూడ టౌన్: నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తున్న చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స.హ. చట్ట సలహా, సహాయ, రక్షణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సరికొండ రుషికేశ్వరరాజు కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొండల్, కార్తీకరాజు, శ్రీను పాల్గొన్నారు.

మిర్యాలగూడ: ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్, మాల మహానాడు విద్యార్థి విభాగం జాతీయ ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి సురేష్ ఆరోపించారు. ఈ మేరకు సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీఏ వీరస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు.

దేవరకొండ : బకాయి ఉపకార వేతనాలను విడుదల చేయాలని టీఎన్ఎస్ఎఫ్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి జర్పుల జగన్‌నాయక్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా బకాయిలు విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు.

చిట్యాల:సీసీ కెమెరాల ఏర్పాటుతో మరింత భద్రత ఉంటుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నూతి సైదులు ముదిరాజ్ అన్నారు. చిట్యాల పట్టణంలోని 1వ వార్డు శివనేనిగూడెం గ్రామంలో సొంత ఖర్చులతో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంతా భాగస్వాములు కావాలన్నారు.

నార్కట్‌పల్లి : ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీల అములుపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటంచేస్తామని సీపీఐఎం మండల కార్యదర్శి చెర్కు పెద్దులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో అన్నిఅంశాలను అమలుచేయాలన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ కల్లూరి యాదగిరి, దండు రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి:రాష్ట్ర నూతనచిహ్నంలో ఉస్మానియా యూనివర్సిటీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఉండేలా చూడాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పీఏపల్లి, గుడిపల్లి తహసీల్దార్ల కార్యాలయాల్లో ఈ మేరకు పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బోగోజు మహేశ్వరచారి, మండల కన్వీనర్ నిమ్మల ఆంజనేయులు, కోకన్వీనర్ పేరిక సుధాకర్, పెరిక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలంలో పదోన్నతిపై వెళ్తున్న హెచ్‌ఎంలను స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చెరుపల్లి శ్రీనివాసులు, శ్రీనయ్య, వెంకటేశ్వర్లు, ఎబినైజర్, సూర్య, కొర్ర లోక్యనాయక్, జగదీష్, నల్లా నరసింహ, చంద్రయ్య, జనార్ధన్‌రెడ్డి, శ్రీపతిరావు, సైదానాయక్, అశోక్‌రెడ్డి, దేవకుమార్, లక్ష్మయ్య, అజార్‌అలీ, అక్కిరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. అధికారులు, ఎంపీటీసీలు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

అంకితభావంతో ఉపాధ్యాయులు పనిచేయాలి



వేములపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, జూన్ 18 : ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల, బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నందున విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా చూడాలన్నారు. బీసీ సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ సిబ్బంది ద్వారా రికార్డులను పరిశీలించి సకాలంలో కిచెన్ రూమ్ తెరవకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, అలసత్వం ప్రదర్శిస్తే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. పాఠశాల్లోని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంఈవో బాలాజీనాయక్, ఎంపీపీ పుట్టల సునీత, ప్రత్యేకాధికారి వసంతకుమారి, ప్రధానోపాధ్యాయులు రమేష్, నాయకులు రావు ఎల్లారెడ్డి, మాలి కాంతారెడ్డి, పాండు, ఉపాధ్యాయులు అయ్యపురెడ్డి, సుధాకర్, సైదిరెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం



మంగళపల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్, జూన్ 18 : ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం మండలంలోని మంగళపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే ఉద్దేశంతో పాఠశాల ప్రారంభానికి ముందే పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసిందన్నారు. బడిబాట సందర్భంగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ మెంబర్ చామల శ్రీనివాస్, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, ఎంఈవో మేకల నాగయ్య, బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎం కర్రె వీరారెడ్డి, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి యేసుపాదం, గాదగోని కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వానలు కురవాలని బొడ్రాయికి జలాభిషేకాలు



చెర్వుగట్టులో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మల్ల బాలకృష్ణ, రైతులు

నార్కట్‌పల్లి, జూన్ 18: వానలు కురవాలని కాంక్షిస్తూ మండలంలోని చెర్వుగట్టు, నెమ్మాని గ్రామాల్లో బొడ్రాయికి జలాభిషేకాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో యజ్ఞాలు, సింధూరాభిషేకాలు నిర్వహించారు. దుక్కిదున్ని విత్తనాలు నాటేందుకు ఎదురుచూస్తున్నా వరుణుడు కరుణించకపోవడంతో స్వామిని ప్రసన్నం చేసుకునేందుకు జలాభిషేకాలు చేశారు. చెర్వుగట్టులో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, చీర మల్లేశ్, బిక్షం, బండ లింగయ్య, కడగంచి శంకర్, మోటె లక్ష్మణ్, మందుల నర్సింహ్మ, కోడూరి మల్లయ్య, గంట శేఖర్, చీర శంకర్, మిర్యాల రమేశ్, దయ్యాల స్వామి, నరేశ్, శ్రీశైలం, శివ, జగదీశ్ పాల్గొన్నారు. నెమ్మానిలో జరిగిన కార్యక్రమంలో ఆలుగుబెల్లి మధుసూదన్‌రెడ్డి, ఏళ్ల రఘుపతిరెడ్డి, చలపతిరెడ్డి, బానాల వెంకట్‌రెడ్డి, మేకల వెంకట్‌రెడ్డి, బుర్రి ఎల్లేశ్, బండ లింగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలి

చింతపల్లి, జూన్ 18: గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పొందేందుకు జీరో బిల్లు పొందనివారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో సుజాత కోరారు. మంగళవారం చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లు పేపర్, ప్రజాపాలన దరఖాస్తు జిరాక్స్‌లను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిట్యాలలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

చిట్యాల, జూన్ 18 :విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు కోరారు. చిట్యాల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చిట్యాలకు చెందిన కొరివి వెంకన్న సహకారంతో రూ.35వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, పాల్వాయి అర్చన, ఇమ్మడి వెంకన్న, పందిరి రమేష్, బూరుగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హాలియా: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అనుముల మండలం చల్మారెడ్డిగూడెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముదుసు ప్రకాష్ అన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకురాతి అమృతయ్య, పల్‌రెడ్డి నిర్మల, మందా సైదులురావుగౌతమ్, తుమ్మకొమ్మ రామకృష్ణ, వడ్త్యా సునీత, గార్లపాటి శ్యామలాదేవి పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: నల్లగొండ పరిధిలోని మామిళ్ళగూడం ప్రభుత్వ పాఠశాలలో అశోక్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ భూతం అరుణకుమారి, సభ్యులు వరంగంటి సంధ్యారాణి, బరుగొర్ల నాగమణి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ దండంపల్లి సరోజ, టీచర్ జ్యోతి పాల్గొన్నారు.